క్లుప్తంగా

కాకాణిని కలిసిన నేతలు



మాజీ మంత్రి కాకాణికి శుభాకాంక్షలు చెబుతున్న సూళ్లూరుపేట నాయకులు

సూళ్లూరుపేట రూరల్: మాజీ మంత్రిని కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్‌ఆర్ సీపీ సూళ్లూరుపేట నియోజవర్గ నాయకులు గురువారం కలిశారు. మాజీ మంత్రి షష్టిపూర్తి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెట్టి వేణు, కట్టా కమలాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిలకా యుగంధర్ కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

13న జీపీడీపీ సమావేశం

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో 13వ తేదీన జీపీడీపీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మండల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

అవగాహనతోనే క్యాన్సర్ దూరం



వైద్య సిబ్బంది ర్యాలీ

సైదాపురం: క్యాన్సర్‌పై అవగాహన కలిగి ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స పొందితే నివారణ సుసాధ్యమని మండల వైద్యాధికారి నిత్య ప్రశాంతి తెలిపారు. జాతీయ క్యాన్సర్ నిర్మూలన అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని సైదాపురంలో గురువారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉంటే ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. మద్యం తాగకుండా, పొగాకు, గుట్కా వాడకుండా ఉండాలన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ కోరారు. మండల కేంద్రమైన సైదాపురంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఈ పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ప్రతి ఇంట్లో సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీవీసత్రంలో వర్షం

దొరవారిసత్రం: మండల పరిధిలో బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. డీవీ సత్రం, కుప్పారెడ్డిపాళెం, ఏకొల్లు, నెలబల్లి, నేలపట్టు తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం పడింది. వివిధ గ్రామాల్లోని చెరువుల్లోకి సాగు నీరు చేరింది.

అమరవీరుల స్ఫూర్తితో భూపోరాటాలు



మాట్లాడుతున్న పోలయ్య

సైదాపురం: అమరవీరుల స్ఫూర్తితో భూపోరాటాలు సాగిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సైదాపురంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో గురువారం అమరవీరుల వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్1 నుంచి 9వ తేదీ వరకు అమరవీరుల వర్ధంతి సభలను నిర్వహించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాజీలేని పోరాటాలతో ప్రతిఘటించిన అమరవీరుల త్యాగాలను ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, చెంగ్రాలవు, వెంకటయ్య తదితరులున్నారు.

నిరక్షరాస్యులను గుర్తించాలి

సూళ్లూరుపేట రూరల్: గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వలంటీర్ టీచర్లను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ప్రమీలారాణి తెలిపారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సీడీపీఓ శారదాంబ ఎంపీఓ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం!

పచ్చనేతల కన్ను పడితే చాలు ఎలాంటి భూములైనా వారి స్వాధీనం కావాల్సిందే. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భూములు కూడా వారి పరమైపోతున్నాయి. అధికారంలోకి వచ్చింది మొదలు చిన్న స్థాయి నాయకుల నుంచి పెద్ద నాయకుల వరకు భూములను చెరబట్టే పనిలో ఉన్నారు. ఆలయాల భూములను కూడా వేలంపాటలు నిర్వహించకనే పచ్చనేతలు స్వాధీనం చేసుకుంటున్నారు. స్వాధీనం చేసుకుని వెంటనే చదును చేసి సాగుకు సిద్ధమవుతున్నారు. దేవదాయ శాఖ అధికారులు వేలంపాట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే పెద్ద నాయకుల నుంచి ఫోన్ రావడంతో వేలం పాట రద్దు చేసి వెళ్లి పోతున్నారు.

– సూళ్లూరుపేట రూరల్

- పచ్చనేతల కన్ను పడితే ఆక్రమణే..
- వేలంపాట లేకనే ఆలయ భూములు టీడీపీ నేతల స్వాధీనం
- పెద్ద నాయకుల నుంచి ఫోన్ రావడంతో వేలం పాట రద్దు
- చూసీచూడనట్లుగా ఉన్న దేవదాయ శాఖ



వేలంపాట నిర్వహించకనే చదును చేసిన దేవదాయశాఖ భూములు

దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయ భూములకు కూడా భద్రత లేకుండా పోయింది. ఫలితంగా ఆలయ భూములను కూడా పచ్చనేతలు దర్జాగా స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన దేవదాయశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

సూళ్లూరుపేట మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో టీడీపీ నేతలు దౌర్జన్యాలు సాగిస్తున్నారు. వారి కన్నుపడితే చాలు ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. యథేచ్ఛగా ఆలయ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. మండల పరిధిలోని తోటకట్ల గ్రామంలో శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం దేవదాయశాఖ పరిధిలో ఉంది. ఆలయానికి కొరిడి గ్రామంలో సర్వే నెంబర్ 112లో 1.79 ఎకరాలు, 158 సర్వే నెంబర్‌లో 0.96 సెంట్లు , దామరాయి గ్రామంలో సర్వే నెంబర్లు 18, 105లో 1.67, 2.14 ఎకరాలు ఉన్నాయి. అదే విధంగా కడపత్ర గ్రామంలో సర్వే నెంబర్లు 76, 172, 196, 257, 430లలో 0.93, 0.35 , 2.38, 3.40, 0.38 మొత్తం కలిపి 14 ఎకరాల మెట్ట, మాగాణి సాగు భూమి ఉంది. ఆలయ దీపధూప నైవేద్యాల కోసం ప్రతి మూడేళ్లకు ఒకసారి కౌలు ఇచ్చేందుకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తారు. సమయం దగ్గర పడడంతో ఆలయ భూమి కౌలుకు ఇచ్చేందుకు అక్టోబర్ నెల 29వ తేదీన బహిరంగ వేలం వేయాలని ప్రకటించారు. దేవదాయశాఖ అధికారులు, రెవెన్యూ, ఇతర అధికారుల సమక్షంలో వేలంపాటకు పిలుపునిచ్చారు. ఆలయ ఈఓ మమత కూడా వేలంపాట నిర్వహించేందుకు అక్కడకు చేరుకున్నారు. బహిరంగ వేలం పాట నిర్వహిచకుడదని టీడీపీ పెద్ద నాయకుల నుంచి ఫోన్ రావడంతో అక్కడికక్కడే వేలంపాట రద్దు చేసి వెళ్లిపోయారు. దీంతో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో పచ్చనేతలు ఆలయ భూములను వేలంపాట నిర్వహిచకుండానే 14 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ భూమిని వారి ఆధీనంలోకి తీసుకుని సాగు చేసుకునేందుకు చదును చేస్తున్నారు. లోలోపలే వేలంపాట లేకనే తక్కువ వేలంతో నగదు అందజేసి భూములను దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ స్థాయిలో దేవదాయశాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. పట్టించుకోవాల్సిన దేవదాయ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రసన్న వెంకటేశ్వస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో దీనిని దేవదాయశాఖ ఆధ్వర్యంలో పడగొట్టారు. ఆలయం కూడా లేదు ఆలయ భూమిని మాత్రం అన్యాక్రాంతం చేస్తున్నారని గ్రామీణులు టీడీపీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేలంపాట నిర్వహిస్తాం

భూములను అన్యాక్రాంతం కాకుండా చూస్తాం. ఈ నెల 8వ తేదీన ఆలయ భూములకు వేలం పాట నిర్వహిస్తాం. రెండు సార్లు వేలంపాట నిర్వహిచాం. అయితే ఎవరూ ముందుకు రాలేదు. బహిరంగ వేలం పాట తప్పకుండా జరిపిస్తాం. ఆలయ భూములు అంత తేలికగా ఎవరికీ అందజేయం.

– మమత, ఆలయ ఈఓ

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



దక్కిలి: మాట్లాడుతున్న ఎంఈఓ

దక్కిలి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం అక్షరాస్యత కార్యక్రమం అమలు చేసేందుకు సంబంధిత వలంటీర్ టీచర్లు, వీవోఏలు, సీసీలకు ఉల్లాస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఒక్కో వలంటీర్ 15 మందిని అక్షరాస్యులుగా చేయాలన్నారు. చదువుకు అవసరమైన సామగ్రితోపాటు విద్యనభ్యసించే వయోజన మహిళలకు రోజుకు రూ.25 చెల్లిస్తామన్నారు. వయోజనులు ఖాళీగా ఉండే సమయంలో విద్యను బోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జమునారాణి, సీసీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సురేష్, పొదుపు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

కండలేరులో 49.386 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 49.386 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 1000, పిన్నేరు కాలువకు 60, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు



అవగాహన కల్పిస్తున్న జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం

చిల్లకూరు: ప్రతి పౌరుడు ఇతరుల హక్కులకు భంగం కలిగించకూడదని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం అన్నారు. గూడూరు కోర్టు ఆవరణలో గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సమాజంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. ఇతరులతో స్నేహపూర్వకంగా మెలగుతూ మంచి పౌరులుగా ఉండాలని తెలిపారు. చిన్నచిన్న వివాదాల కారణంగా ఘర్షణలు, హత్యలకు పాల్పడకూడదని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, ఏజీ పద్మావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, సీనియర్ న్యాయవాది చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో సంస్కరణలు



హేమచంద్రారెడ్డిని సన్మానిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు

కోట: జాతీయ విద్యావిధానం ఎన్‌ఈపీ-2020 ప్రాముఖ్యతను ఏపీ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్, జేఎన్‌టీయూ అనంతపురం ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి వివరించారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధ్యాపకుల శిక్షణ కార్యక్రమానికి గురువారం ముఖ్య అతిథిగా విచ్చేశారు. మన రాష్ట్రంలో ఈ విద్యావిధానాన్ని అమలు పరచడంలో భాగంగా విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. అందులో భాగంగా లెర్నింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ఎన్‌బీకేఆర్‌లో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అధ్యాపకులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. అనంతరం హేమచంద్రారెడ్డిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను గణించాలి



మాట్లాడుతున్న మేనేజర్ మురళీకృష్ణ

దొరవారిసత్రం: ప్రతి కుటుంబంలోని సభ్యుల నైపుణ్యత గుర్తించి అర్హత ఉన్న వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి స్కిల్ డెవలెప్‌మెంట్ చేస్తామని ఏఓ రఘురామయ్య తెలిపారు. దొరవారిసత్రం మండల పరిషత్‌కార్యాలయంలో గురువారం స్కిల్ డెవలెప్‌మెంట్‌పై సచివాలయం సిబ్బందికి సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ స్కిల్ డెవలెప్‌మెంట్ మేనేజర్ మురళీకృష్ణ తరగతులను నిర్వహించి, అవగాహన కల్పించారు.

కోటలో..

కోట: నైపుణ్య గణన సర్వేపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వేణుగోపాల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి స్కిల్ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అన్నీ పంచాయతీల్లోనూ స్కిల్ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ సూచించారు.

ఉల్లాస్‌పై శిక్షణ

దొరవారిసత్రం: ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఉల్లాస్‌పై వీఓఏలు, స్వచ్ఛంద వలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యంగా తీసుకుందని స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, ఏపీఎం మునిరాజ పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం పద్మమ్మ అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో వయోజన విద్యపై సీసీఎస్ వలంటీర్లకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో నిరక్షరాస్యులైనవారు రాత్రి బడులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ చంద్రశేఖర్, వీఓఏలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్: పదహారేళ్ల బాలిక ఇంటి నుంచి బజారుకు వచ్చి కనిపించకుండా పోయిందని బాలిక తల్లి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఆమె చెల్లెలిని తీసుకుని బుధవారం మధ్యాహ్నం బజారుకు వచ్చింది. చెల్లెలిని బంధువుల ఇంటిలో వదిలి పెట్టింది. తిరిగి ఇంటికి రాక పోవడంతో బాలిక కోసం బంధువులు ఇళ్ల వద్దకు వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్తా చాటిన కృపప్రిన్సీ

నాయుడుపేట టౌన్: చింతపల్లి కృపప్రిన్సీ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో సత్తా చాటింది. ఏలూరులో నిర్వహించిన ఈ పోటీలలో నాయుడుపేట బాలభారతి పాఠశాలకు చెందిన కృపప్రిన్సీ 600 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం దక్కించుని కాంస్య పతకం అందకుంది. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుని రజత పతకం దక్కించుకుంది. విద్యార్థినిని కోచ్ మోమిడి లక్ష్మయ్య, తల్లిదండ్రులు చింతపల్లి శేఖర్‌బాబు, ఉష అభినందించారు.

అయ్యప్ప స్వామి నగరోత్సవం

చిల్లకూరు: గూడూరు మున్సిపల్ పరిధిలోని కాశీ లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం నూతన విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. అందులో భాగంగా గురువారం విగ్రహానికి నగరోత్సవం నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు భజనలు, సంకీర్తనలు, శరణు ఘోషలతో కేరళ వాయిద్యాల నడుమ నగరోత్సవం నిర్వహించారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండు మీదుగా ఆసుపత్రి రోడ్డు టవర్ క్లాక్, బజారు వీధి, మీదుగా ఆలయానికి ఉత్సవం చేరుకుంది. శుక్రవారం ఉదయం శబరిమలకు చెందిన శంకరన్ నంబూద్రి, శబరిమల మేల్‌శాంతి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని అయ్యప్ప భక్త బృందం తెలిపింది. భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



నగరోత్సవంలో అయ్యప్ప స్వామి

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రం సైదాపురం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. మండలంలో పనులు లేక చాలా మంది కార్మికులు పనుల కోసం నిరీక్షిస్తున్నారన్నారు. వారికి వెంటనే పనులను కల్పించాలని కోరారు. విధుల విషయంలో అలక్ష్యం చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రయ్య తదితరులున్నారు.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ తరగతులు

సూళ్లూరుపేట రూరల్: జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సూళ్లూరుపేట వ్యవసాయ సబ్‌డివిజన్ కార్యాలయంలో వీఏఏలు, ఏఈఓలకు సామర్థ్యం పెంపుదలపై గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మి సిబ్బందికి పొలంబడి పద్ధతులతో వచ్చే దిగుబడులను వివరించారు. ఏడీఏ అనిత, వ్యవసాయ ఏఓలు కవిత, జోతిర్మయి, కిరణ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు: భూముల సర్వే గతంలో నిర్వహించినప్పటికీ వాటిలో తప్పొప్పులను సరిచేసేందుకు మరోసారి రీ సర్వే చేపడుతున్నామని చిల్లకూరు ఆర్‌ఐ పూర్ణా తెలిపారు. మండలంలోని గూడూరు గ్రామంలో గురువారం రీ సర్వే సమస్యల పరిష్కారంపై గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు వినతులు అందించారు. ఆయా వినతుల మేరకు సర్వే బృందాలు సర్వే చేసి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ సుబ్రమణ్యం, గ్రామ సర్వేయర్లు తరుణ్, శశికుమార్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేష్

వెంకటగిరి(సైదాపురం): క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాతకోట పీహెచ్‌సీ వైద్యుడు ఎం.రాజేష్ పేర్కొన్నారు. దీనిపై నినాదాలు చేస్తూ గురువారం పట్టణంలో క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యపరీక్షలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ విక్టోరియా, ల్యాబ్ టెక్నీషియన్ ఫయాజ్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో వివక్ష



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, బాధితులు

కలువాయి: ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపులో అధికారులు దళితులపై వివక్ష చూపుతున్నారని ఎంఆర్‌పీఎస్ నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య మాదిగ ఆరోపించారు. కలువాయి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మాదన్నగారిపల్లిలో 223, 224, 227, 231, ఇతర సర్వే నంబర్లలో 100 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన పలువురు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీటిలో కేవలం నాలుగు ఎకరాలు సాగు చేసుకుంటున్న ముగ్గురు దళితులపై అధికారులు వివక్ష చూపుతున్నారన్నారు. వారు సాగు చేసుకున్న పైరు ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. తొలగిస్తే మొత్తం ఆక్రమణలను తొలగించాలని లేకుంటే తాము ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. దీనిపై కలువాయి తహసీల్దార్ శ్యాంసుందర్‌రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నడుచుకుంటామన్నారు. దళితులపై వివక్ష చూపాల్సిన అవసరం తమకు లేదన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: మండల పరిధిలోని గంగదేవిపల్లి గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్ సీపీ నేత అన్నెం చలపతి కుమారుడు శ్రీనాథ్ నలుగు వేడుకల్లో గురువారం ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వరుడిని ఆశీర్వదించారు, అదే కాలనీలో వైఎస్‌ఆర్ సీపీ నేత అన్నెం వెంకటేశ్వర్లు కుమార్తె పూర్ణిమ నలుగు కార్యక్రమంలో పాల్గొని, వధువును ఆశీర్వదించారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి రూరల్ మండలంలోని కె.ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్ సీపీ నేత నాగవోలు పుల్లారెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రాజారెడ్డి, లక్ష్మి ప్రియాంక వివాహ వేడుకల్లో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు



చెట్లు నరికేస్తున్న దృశ్యాలు

పెళ్లకూరు: చింతపూడి పంచాయతీ, యాలకారికండ్రిగ గ్రామంలో గురువారం రెండు కుటుంబాల మధ్య నెలకొన్న స్థల వివాదంలో చెట్లు నరికివేశారు. ఒక వర్గం మరో వర్గం ఇంటి వద్ద ఉన్న మామిడి, నిమ్మ, జామ తదితర చెట్లను నరికేయడంపై బాధితులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు సుభాషిణి కథనం మేరకు గ్రామంలోని సర్వే నంబరు 46/11లోని తన ఇంటి సమీపంలో మామిడి, జామ, నిమ్మ చెట్లను పెంచుకుంటున్నట్లు తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన సుధాకర్, జనార్ధన్ మరి కొందరు కలిసి దౌర్జన్యంగా ఇంటి మీద దాడి చేసి, చెట్లు నరికేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయమై పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధ్యతతో పని చేస్తే గుర్తింపు



వీఆర్‌ఓ రవిచంద్రను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

పెళ్లకూరు: విధుల్లో అంకితభావంతో బాధ్యతగా పని చేసే ప్రతి ఒక్కరికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని స్థానిక తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం బదిలీపై వెళ్లిన వీఆర్‌ఓ రవిచంద్రను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలతో కార్యాలయానికి విచ్చేసే అర్జీదారులతో సఖ్యతగా మెలగడమే కాకుండా సరైన సమయంలో పూర్తి స్థాయి పరిష్కరించడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం బదిలీపై గూడూరు వెళ్తున్న వీఆర్‌ఓ రవిచంద్రను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ యువరాజ్, ఆర్‌ఐ సంతోషిణిభాయి, వివిధ గ్రామాల వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓ పరిశీలన



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్మయి

పెళ్లకూరు: 71వ నంబరు జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి పనులకు కేటాయించిన భూములను పలు ప్రాంతాల్లో గురువారం సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి పరిశీలించారు. తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు తదితర గ్రామాల్లోని రోడ్డు అభివృద్ధి కోసం కేటాయించిన స్థలాలు, ఇళ్లు తదితరాలను పూర్తి స్థాయిలో పరిశీలించారు. త్వరలోనే నిర్వాసితులకు పరిహారం చెల్లించేలా చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాథ్ రెడ్డి, వీఆర్‌ఓ వంశీ, సర్వేయర్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సూచనలు చేసిన డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్: ఆటోడ్రైవర్‌లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. నాయుడుపేట పోలీస్ డివిజన్ కార్యాలయం వద్ద గురువారం ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. జాగ్రత్తలు నిబంధనలు పాటించాలని సూచించారు. సీఐ బాబి మాట్లాడుతూ ఎవరికైనా డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడంలో ఇబ్బందులు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ఎంవీఐతో మాట్లాడి లైసెన్స్‌లు మంజూరు చేసేలా చర్యలు చేపడుతామని సూచించారు. ప్రతి ఆటోపై పోలీస్ నంబర్లు వేసుకోవాలని సూచించారు.